క్లుప్తంగా

ఎంపీ కృషితో పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

కలకడ : రాజంపేట పార్లమెంట్ సభ్యులు పీవీ మిథున్‌రెడ్డి కృషితో కలకడ టౌన్ రాజీవ్ నగర్ కాలనీకి చెందిన షబ్బీర్ అహమ్మద్ కుమారుడు సాబజ్‌అహమ్మద్‌కు రూ.3 లక్షల ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ మంజూరైనట్లు ఎంపీ మిథున్‌రెడ్డి కార్యాలయం సిబ్బంది శనివారం తెలిపారు. కలకడకు చెందిన యువకుడు సాబజ్‌అహమ్మద్‌కు కిడ్నీ మార్పిడికి చికిత్స కోసం ఆర్థిక సహాయం కోరగా ఎంపీ మిథున్‌రెడ్డి పీఎం రిలీఫ్ ఫండ్ రూ.3లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. సాబజ్‌అహమ్మద్ కుటుంబ సభ్యులు ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రత్యేక కౌంటర్లు

మదనపల్లె : ఏపీఎస్పీడీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం మదనపల్లె డివిజన్‌లోని అన్ని ఈఆర్‌ఓ కలెక్షన్ కౌంటర్లు తెరచి ఉంచనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధరం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్ బిల్లులను చెల్లించి, సంస్థ అభివృద్ధికి తోడ్పాటునందించాలని వినతిచేశారు.

రేపటి నుంచి ఉచిత యోగా తరగతులు

మదనపల్లె సిటీ: స్థానిక రెడ్డీస్‌కాలనీలోని శ్రీ దత్త క్రియాయోగా ఇంటర్నేషనల్ సెంటర్‌లో సోమవారం నుంచి ఉచిత సమ్మర్ యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైసూర్‌కు చెందిన యోగా టీచర్లచే ప్రాణాయామములు, ముద్రలు, నాడీ శుద్ధ వ్యాయామాలు, ఆసనాలు, ధాన్యము నేర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 5.45 నుంచి 6.45 వరకు, సాయంత్రం 5.45 నుంచి 6.45 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9440650377, 7780121569 నంబర్లలో సంప్రదించాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉరితాడుతో రైతు నిరసన

బి.కొత్తకోట: మండలంలోని గండువారిపల్లెకు చెందిన రైతు సుదర్శన్ తమ భూమికి సంబంధించి ఆన్‌లైన్‌లో వన్‌బీ, అడంగల్ రావడం లేదని ఉరితాడుతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశాడు. కార్యాలయం ఎదుట తాడుతో బైఠాయించాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. దీనిపై సర్వేయర్ ముబారక్ మాట్లాడుతూ జాయింట్‌లో ఉన్న భూమిపై విచారణ జరిపి మంగళవారం తహసీల్దార్‌కు నివేదిస్తామని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అజారుద్దీన్ చెప్పారు.

శివలింగాలకు అభిషేకం



పెద్దతిప్పసముద్రం: మాస శివరాత్రి సందర్భంగా శనివారం స్థానిక శివాలయంలో సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో 1008 శివలింగాలకు అభిషేకం నిర్వహించారు. పంచ గవ్వములతో శుద్ధి చేయించిన పుట్ట మట్టితో శివలింగాలను తయారు చేయించారు. అనంతరం వేద పండితులు ఖన్నాస్వామి, మణికంఠ స్వామి, మురళీ స్వామి, నవీన్ శర్మలు మట్టితో చేసిన లింగాలను అలంకరించి రుద్రహోమం, పూర్ణాహుతి, అభిషేకాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వితంతు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోండి

కలికిరి: ఇది వరకే పెన్షన్ పొందుతూ చనిపోయిన వారి భార్యకు పెన్షన్ మంజూరు చేయుటకు ప్రభుత్వం ఉత్తర్వులు వచ్చినట్లు ఎంపీడీఓ భానుమూర్తి రావు తెలిపారు. 01-12-2023 నుంచి 31-10-2024 లోపు చనిపోయిన వారి స్థానంలో వారి భార్యలు, భర్త మరణ ధృవీకరణపత్రం, ఆధార్, రేషన్ కార్డు తదితరాలతో సంబంధిత గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మండల పరిధిలో భర్తలు చనిపోయిన వారు అద్దవారిపల్లి-11, చీకటిపల్లి-2, గుండ్లూరు-7, గుట్టపాళెం-9, కలికిరి నాలుగు సచివాలయ పరిధిలో 40, మహల్-4, మేడికుర్తి-11, మర్రికుంటపల్లి-9, మునెళ్ళపల్లి-8, పల్లవోలు-6, పత్తేగడ గ్రామంలో 11 మంది ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

వృద్ధులు, చిన్నారులకు అన్నదానం

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు భాస్కర్ తన స్నేహితురాలు రూపకళ పుట్టిన రోజు వేడుకలను శబరి ఆశ్రమంలో నిర్వహించారు. ఆశ్రయంలో ఉంటున్న 80 మంది వృద్ధులు, చిన్నారులకు మిఠాయిలు పంచి పెట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ శనివారం పేర్కొన్నారు.

పది ఫలితాల్లో ఢీలా

- దారుణంగా పడిపోయిన పదో తరగతి ఫలితాలు
- పరీక్షల్లో తప్పాడని మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య
- ఉపాధ్యాయులున్నా 50 శాతం మంది ఫెయిల్



గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్

గుర్రంకొండ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు, ఉపాధ్యాయులు ఉన్నా పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు వెనుకబడ్డారు. పరీక్షల్లో ఫెయిల్ కావడంతో విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారింది. పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడని మనస్తాపం చెందిన ఓ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ప్రతి ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అవుతుండటం గమనార్హం. ఒక్కోసారి 50 శాతం కూడా ఉత్తీర్ణత శాతం దాటకపోవడం దారుణం. ప్రభుత్వ పాఠశాలల్లో తగినంతమంది ఉపాధ్యాయులున్నా ఫలితాలు మాత్రం దారుణంగా ఉండడంతో ఈ పాపం ఎవరిది అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నాలుగేళ్లుగా పడిపోయిన ఫలితాలు

మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో నాలుగేళ్లుగా పదవ తరగతి పరీక్షా ఫలితాలు దారుణగా పడిపోతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రమైన గుర్రంకొండలోని తెలుగు, ఉర్దూ జెడ్పీ హైస్కూళ్లలో పరిస్థితి మరీ దారుణంగా మారిపోయిందని గ్రామస్తులు చర్చించుకొంటున్నారు. 2024-25 ఏడాది గానూ తెలుగు జెడ్పీ హైస్కూల్లో 106 మంది గానూ 43 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 2023-24లో 114 మందికిగానూ 62 మంది, 2022-23లో 132 మందికి 65, 2022-21లో 133 మందికి గానూ 55 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఉర్దూ జెడ్పీహైస్కూల్లో ఈఏడాది 78 మందికి గానూ 26 మంది, 2023-24లో 68 మందికి 47 మంది, 2022-23లో 64 మందికి 34 మంది, 2021-22లో 97 మందికి గానూ 54 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది తరిగొండ, మర్రిపాడు జెడ్పీ హైస్కూళ్లలో ఆశించినంత మేరకు ఫలితాలు రాకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అన్ని వసతులున్నా ఫలితాలు ఏవీ?

గత ఐదేళ్లలో ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలకు అన్ని వసతులు కల్పించింది. కోట్లాది రుపాయలతో నాడు-నేడు కింద పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేసి అందులో అన్ని వసతులను కల్పించింది. నేడు ప్రభుత్వ పాఠశాలల రూపరేఖలు ఎంతో మారిపోయాయి. అయిన ఆశించిన స్థాయిలో ఫలితాలు లేక పోవడం గమనార్హం. గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్లో మొత్తం 23 మంది ఉపాధ్యాయులు, ఉర్దూ జెడ్పీహైస్కూల్లో 15 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గణితం సబ్జెక్టుకు ముగ్గురు, సైన్స్ సబ్జెక్టుకు ఆరుగురు చొప్పున ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ ఏడాది తెలుగు జెడ్పీ హైస్కూల్‌కు సంబంధించి గణితంలో 106 మందికి గానూ 57 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. సైన్స్‌లో 32 మంది, ఇంగ్లీషులో 18 మంది ఫెయిల్ అయ్యారు. ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌కు సంబంధించి ఈ ఏడాది మొత్తం 78 మందికి గానూ గణితంలో 26 మంది, సైన్స్‌లో 28 మంది, ఇంగ్లీషులో 26 మంది, సోషియల్‌లో 19 మంది, హిందీలో 18 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం గమనార్హం.

పదవ తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఈ ఏడాది ప్రకటించిన పదవ తరగతి పరీక్షాఫలితాల్లో ఫెయిల్ కావడంతో ఎన్నడూ లేని విధంగా మండలంలోని మర్రిపాడు చెందిన చల్లా విష్ణు అనే విద్యార్థి మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఇలా ఒక విద్యార్థి కేవలం పదవ తరగతిలో ఫెయిల్ అయ్యడని ఆత్మహత్యకు పాల్పడడం ఇదే మొదటి సారి. మృతి చెందిన విద్యార్థి కూడా గణితం, సైన్స్ సబ్జెక్టుల్లోనే ఫెయిల్ అయ్యాడు.

బోధన పక్కన పెట్టి ఇతర వ్యాపకాలపై ఉపాధ్యాయులు

మండల కేంద్రమైన గుర్రంకొండలోని రెండు జెడ్పీ హైస్కూళ్లలో ఉపాధ్యాయులు బోధన పక్కన పెట్టి ఇతర వ్యాపకాలపై ఎక్కువగా శ్రద్ధ చూపిస్తుండడంతో ఫలితాలు దారుణంగా వస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. 184 మంది విద్యార్థులకు గానూ 38 మంది ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తున్నారు. సగటున ఒక్కో ఉపాధ్యాయుడికి ఐదుగురు పిల్లలకంటే ఎక్కువ మంది రారు. ఇంతమంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నా ఫలితాలు దారుణంగా రావడంపై ప్రజలు విమర్శిస్తున్నారు. జెడ్పీ హైస్కూళ్లలో పలువురు ఉపాధ్యాయుల పనితీరు సరిగ్గా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ పనిచేసే ఏక్కవ మంది ఉపాధ్యాయులు గుర్రంకొండ పట్టణానికి చెందిన వారే కావడం ఒక కారణం. కొంతమంది ఉపాధ్యాయులు నామ మాత్రంగా స్కూల్‌కు రావడం తప్ప బోధన చేయడం లేదని, చిట్టీలు, రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్, వ్యవసాయంతో పాటు ఇతర వ్యాపాకాలపై దృష్టి పెడుతున్నారని తల్లిదండ్రులు అంటున్నారు.

పనితీరు మార్చుకోవాలి



జెడ్పీ హైస్కూళ్లలో పనిచేసే పలువురు ఉపాధ్యాయులు తమ పనితీరు మార్చుకోవాల్సి ఉంది. కొన్ని స్కూళ్లలో ఫలితాలు మరీదారుణంగా వచ్చాయి. గుర్రంకొండలోని జెడ్పీ హైస్కూళ్లలో ఎక్కువ మంది విద్యార్థులు రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. ఉపాధ్యాయుల పనితీరుపై గతంలో ఫిర్యాదులు వచ్చాయి. ఇకనైనా ఉపాధ్యాయులు తమ పనితీరు, వ్యవహారశైలి మార్చుకొని బోధనపై దృష్టి సారిస్తే లోపాలను సరిదిద్దుకోవచ్చు. - సురేంద్రబాబు, ఎంఈఓ, గుర్రంకొండ

కార్మికులు మద్యానికి బానిస కావద్దు

– ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి మధుసూదన్



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి మధుసూధన్

మదనపల్లె : కార్మికులు మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి మధుసూధన్ తెలిపారు. శనివారం పట్టణంలోని ఏపీఐఐసీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్(కేర్) ఆధ్వర్యంలో మద్యపానంతో కలిగే దుష్పరిణామాలపై ఇండస్ట్రియల్ ఎస్టేట్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి మధుసూధన్ మాట్లాడుతూ...కార్మికులకు మద్యపానం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేశారు. మద్యపానం సేవించి విధులు నిర్వహిస్తే పని ప్రదేశాల్లో ప్రమాదం జరిగి ఒకోసారి ప్రాణాలు కోల్పోయే పరిస్థితి తలెత్తుతుందన్నారు. అలాగే మద్యపానం కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తుందని, ఆదాయంలో కొంత భాగాన్ని మద్యంకు ఖర్చుచేయడంతో కుటుంబసభ్యుల మధ్య విభేదాలు, గొడవలు, దూరం పెంచుతుందన్నారు. కార్మికులు మద్యపానానికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితం గడపాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ యన్.జయప్రకాష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్.బి.రమేష్‌బాబు, మనం సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు వైవీఎస్.ప్రకాష్, డీసీహెచ్ఎస్ ఆఫీస్ డాక్టర్.కిరణ్, మనత సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఎన్.సహదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ టీచర్ పోస్టుల్లో 2 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి


సైనికుల సంఘం మాజీ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు



మాట్లాడుతున్న కంచర్ల శ్రీనివాసులునాయుడు

మదనపల్లె : రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో సైనికుల, మాజీ సైనికుల భార్యలకు టీచర్ పోస్టులకు సంబంధించి 2శాతం రిజర్వేషన్ అమలు చేయాలని మదనపల్లె డివిజన్ సైనికుల సంఘం మాజీ అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులునాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీఓ 929 ప్రకారం 1971 మే 29 నుంచి జూన్1, 2000 వరకు సైనికులు, మాజీ సైనికులు, మాజీ సైనికుల భార్యలకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు జరిగాయన్నారు. తర్వాత జీఓ 929ను రద్దు చేస్తూ 2002లో జరిగిన ఉపాధ్యాయ నియామకాల్లో రాష్ట్రప్రభుత్వం మొదటిసారి 2శాతం రిజర్వేషన్ అమలు చేశారన్నారు. అయితే 2శాతం రిజర్వేషన్ ఎవరికనేది స్పష్టత లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టుల్లో 2 శాతం అంటే 320 పోస్టులు ఇవ్వాలని, అయితే వెబ్‌సైట్‌లో ఆప్షన్ ఇవ్వలేదన్నారు. 320 ఖాళీల్లో మాజీ సైనికుల భార్యలకు సగం అంటే 160 పోస్టులు స్పష్టంగా ఆన్‌లైన్‌లో కనపరచాలన్నారు. ఈ ఖాళీలకు సరిపడా మాజీ సైనికులు, వారి భార్యలు లేనప్పుడు మిగిలిన పోస్టులు ఖాళీగా ఉంచాలే తప్ప ఇతరులకు కేటాయించకూడదన్నారు. మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ, తమకు ఎలాంటి సమాచారం అందడం లేదన్నారు. సమావేశంలో మాజీ సైనికుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలుడు

కురబలకోట: మండలంలోని తెట్టులో వెలసిన శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం రాత్రి గజవాహనంపై స్వామి వారిని ఊరేగించారు. ఆదివారం రాత్రి స్వామి వారి కళ్యాణోత్సవం కనుల పండగలా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కన్యాదాతలుగా కోలారు జిల్లా కోడిపల్లెకు చెందిన వారు వ్యవహరిస్తున్నారు. అదే రోజు రాత్రి గరుడోత్సవం వైభవంగా జరగనుంది. సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం అన్న సంతర్పణ గావిస్తున్నారు. మంగళవారం గాలేటివారిపల్లెకు చెందిన నులక కుటుంబీకులచే అశ్వవాహనం కొనసాగనుందని గ్రామస్థులు తెలిపారు.

దళిత గ్రామాల అభివృద్ధికి కృషి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కేవీపల్లె : మండలంలో దళిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. శనివారం కేవీపల్లె హరిజనవాడలో పౌర హక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. దళితుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలివ్వాలని కోరారు. నీటి సమస్య, డ్రైనేజీ సమస్య తీర్చాలన్నారు. గతంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు పాతబడి వర్షాలకు ఉరుస్తున్నాయని తెలిపారు. స్పందించిన తహసీల్దార్, ఎంపీడీఓ మాట్లాడుతూ తమ దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఏవో శ్రావణి మాట్లాడుతూ దళితులకు సబ్సిడీ కింద పీవీసీ పైపులు, ట్రాక్టర్ రోటావేటర్, ఐదు మడకలు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ముల్లంగి చంద్రయ్య, ఈపూరి ఆంజినేయులు, అమృతపురి శ్రీనివాసులు, నాగేశ్వర, శేషాద్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో విశేషమైన ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు.

చిరుత దాడిలో నష్టపోయిన రైతుకు పరిహారం



బాధిత రైతుకు చెక్కును పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

నిమ్మనపల్లె: చిరుత పులి దాడిలో మేకను నష్టపోయిన రైతుకు శనివారం మదనపల్లె అటవీ శాఖ కార్యాలయంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.జయప్రసాదరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జె మధుసూదన్ నష్టపరిహారంకు సంబంధించిన చెక్కును రైతుకు పంపిణీ చేశారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ, పారేశువారిపల్లెకు చెందిన రైతు పి.రామయ్య గత ఏడాది నవంబర్ 8వ తేదీన మేకలను సమీపంలోని గుట్టకు తోలు కెళ్ళి మేపుతుండగా చిరుతపులి దాడి చేసి ఓ మేకను చంపేసింది. బాధిత రైతుకు పరిహారం చెల్లింపు కోసం అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం నష్టపరిహారం కింద మంజూరు చేసిన రూ.7500 చెక్కును బాధిత రైతు పి.రామయ్యకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్.బి.ఓ దీప పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన

పెద్దతిప్పసముద్రం: మండల కేంద్రంలో శనివారం ఎస్ఐ హరిహర ప్రసాద్ రోడ్డు ప్రమాద నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వినియోగించాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు చెల్లించాల్సి ఉంటుందని, ప్రధానంగా మైనర్లకు వాహనాలు ఇస్తే వారి కన్నవాళ్ళు జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా అనుభవించాల్సి ఉంటుందని ఎస్ఐ హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఎంవీఐ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాద రహిత మండలంగా తీర్చి దిద్దేందుకు సహకరించాలన్నారు.

ఆకట్టుకున్న ద్రౌపది కల్యాణం

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం నిర్వహించిన ద్రౌపది కల్యాణ మహోత్సవం ప్రజలను ఎంతో ఆకట్టుకుంది. మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెలో మాజీ సర్పంచ్ రామయ్య ధర్మకర్తగా నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞం 14 పర్వాలను 14రోజులు హరికథ కాలక్షేపం కళాకారులచే నాటకాలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ద్రౌపది-పాండవులకు కల్యాణం జరిపించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : ప్రభుత్వంచే నిర్వహించబడనున్న హెచ్‌పీ పెట్రోల్ బంకు ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన చేపట్టారు. శనివారం మండలంలోని గూడరేవుపల్లె పంచాయతీ నాలుగులేన్ల జాతీయ రహదారి పక్కన సర్వే నెంబరు 198లో 0.75 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, చెన్నై ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్ రాజ్‌కుమార్, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేధించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో హేమంత్‌కుమార్, వీఆర్ఏ ఆది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాల చారిత్రాత్మక విజయం



విద్యార్థి భానుశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో చారిత్రాత్మక విజయం సాధించినట్లు హెచ్‌ఎం నటరాజన్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో పదిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సమావేశం నిర్వహించారు. ఆ పాఠశాల విద్యార్థి ఎస్. భానుశేఖర్‌రెడ్డి 581 మార్కులతో మొదటి స్థానం సాధించడంతో దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించారు. అలాగే 500 పైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 1937 స్థాపించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎందరో మహానుభావులు చదివి ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శిరీష, లీలావతి, శశిదేవి, జీనత్, షరీఫున్నీసా, నాగవేణి, యర్రయ్య, జనార్ధన్‌రెడ్డి, శివకుమార్, రమణ, గౌస్, బాలాజి, తల్లిదండ్రులు భారతి, ఉత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన



టాపర్ శ్రావణికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం సుబ్బారెడ్డి

మదనపల్లె సిటీ: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం దుశ్శాలువ, జ్ఞాపికతో అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో జెడ్పీ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా రాణించారన్నారు. చదువుతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ, స్కౌట్ ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాలకు చెందిన ఎస్.శ్రావణి 580 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచిందన్నారు. అలాగే తేజ్‌కిరణ్ 578, జహీర్‌ఖాన్ 577, రోహిత్‌కుమార్ 575, షబ్నా 571, కవితాదేవి 570 మార్కులు సాధించారన్నారు. 38 మంది 500 మార్కులుపైగా వచ్చాయన్నారు. పాఠశాలలో అత్యుత్తమ బోధనతో పాటు అధ్యాపకుల కృషితో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు పై తరగతుల్లో కూడా బాగా ఉన్నత లక్ష్యంతో చదివి రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ, మహమ్మద్‌ఖాన్, ఆర్.వి.రమణ,సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం, తాగునీటిపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

రామసముద్రం: తాగునీరు, పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని డీఎల్‌పీఓ నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. అలాగే పైపులైన్ లీకేజీలను అరికట్టాలన్నారు. డంపింగ్ యార్డులు వినియోగంలోకి తీసుకొచ్చి ఇళ్ల పరిసరాల్లో చెత్త దిబ్బలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. వడ దెబ్బకు గురికాకుండా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఊలపాడు పంచాయతీలో తాగునీటి ట్యాంక్‌లు క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుప్రసాద్, ఈవోపీఆర్‌డీ గఫూర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు రూరల్ : ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సి. శేఖర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.వి. రమణ అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఎంప్లాయీస్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. యూనియన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు. డిపో గౌరవాధ్యక్షుడిగా ఎస్. హబీబుల్లా, ప్రెసిడెంట్‌గా ఆర్‌వి. రమణ, వైస్ ప్రెసిడెంట్‌గా కె.వి. రమణ, సెక్రటరీగా ఎస్.కే. బాషా, అసిస్టెంట్ సెక్రటరీలుగా బి.ఆర్. నాయక్, కె. అనిల్, ఎ.వి. రమణ, డి.టి. రెడ్డి, ట్రెజరర్‌గా బి. వేణుగోపాల్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్యారేజ్ చైర్మన్‌గా ఎస్. హబీబుల్లా, ప్రెసిడెంట్ శ్రీరాములు, సెక్రటరీ మన్సూన్‌సాహెబ్, ట్రెజరర్‌గా నరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు.

ఉగ్రవాదుల దాడిపై ప్రజా సంఘాల నిరసన



ఉగ్రవాదుల మారణకాండను నిరసిస్తూ సీపీఎం నిరసన



ఉగ్రదాడికి వ్యతిరేకంగా అఖిలపక్షం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన

మదనపల్లె : జమ్మూ కశ్మీర్‌ను కాపాడుకోవాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు కోరారు. శనివారం స్థానిక బెసెంట్ సర్కిల్‌లో కశ్మీర్‌లో ఉగ్రవాదుల దారుణ మారణకాండను ఖండించండి. మతసామరస్యాన్ని కాపాడుకుందామని కోరుతూ కార్మిక, రైతు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. పహల్గాం మృతులకు నివాళి అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాదం నశించాలి, మత సామరస్యాన్ని కాపాడాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ... టెర్రరిస్టుల కాల్పుల్లో 26 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, అమాయకమైన ప్రజలను ఇలా ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అన్నారు. దీనిని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం తీసుకున్న చర్యలు ఏ మాత్రము సరిపోవన్నారు. కశ్మీర్‌లో భద్రత సరిగా లేదని విమర్శించారు. ఉగ్రవాద వ్యతిరేక ఉద్యమం నిర్మించాలని, దీనికి మతం రంగు పులమకూడదన్నారు. ఉగ్రవాదానికి మతం, కులం లేదన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు నారాయణ, నాగరాజు, రామకృష్ణ రాజు, చలపతి, కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి హేయమైన చర్య

జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైన చర్య అని కూటమి నాయకులు రామ్‌దాస్‌చౌదరి, బండి ఆనంద్, దారంఅనిత, కురవంక సర్పంచ్ చిప్పిలి చలపతి అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం రాత్రి అఖిలపక్షం ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాలన్నారు. దేశంలో జాతీయసమైక్యతకు ప్రాధాన్యత ఇస్తూ బాధిత కుటుంబాలకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భువనేశ్వరిసత్య, భగవాన్, డీఆర్.నరేంద్ర, జర్మన్‌రాజు,పులి నరేంద్రరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నరేంద్ర, కామకోటిప్రసాదరావు, శ్రీనివాసులు, మాజీ సైనికులసంఘం అధ్యక్షులు కంచర్లశ్రీనివాసులునాయుడు, చింటూ, నందిని పాల్గొన్నారు.